క్లుప్తంగా

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ రవికుమార్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌కు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి. వీరభద్రాచారి పాల్గొని మాట్లాడుతూ ఓడీఎఫ్ ప్లస్ సర్వే, శానిటేషన్, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై సమీక్ష చేపట్టారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

17న తృతీయ అఖండ జ్యోతి ప్రజ్వలన



వినుకొండ(నూజెండ్ల): శాంతి ఆశ్రమ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 17న తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వినుకొండ పైన తృతీయ అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హిమాలయ గురువు తెలిపారు. వినుకొండ రూరల్ మండలం విఠంరాజుపల్లి వద్ద గల చిన్న షిరిడీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ అఖండజ్యోతి ప్రజ్వలన కార్యక్రమానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు, జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు పాల్గొంటారని తెలిపారు. భక్తుల సమక్షంలో సాయంత్రం 6.30 గంటలకు ఈ అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పెండేల మోహన్‌రావు, తాతా రమేష్, పెండేల కాశీ, కొప్పురావూరి సుధాకర్, పెండేల సురేష్, పరుచూరి సత్య నారాయణ, డీటీవీఎస్ స్వామి, పెండేల పుల్లారావు, వీరాస్వామి, నాగమణి కొండారెడ్డి పాల్గొన్నారు.

దేవస్థాన భూములకు కౌలు వేలం నిర్వహించాలి

నాదెండ్ల: అప్పాపురం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న దేవదాయశాఖ భూముల కౌలు వేలం నిర్వహించాలని అప్పాపురం గ్రామానికి చెందిన రైతు పర్చూరి కృష్ణారావు సోమవారం నరసరావుపేట కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మరోసారి ఫిర్యాదు చేశారు. అంకమ్మ తల్లి దేవస్థానం ఆధీనంలో ఉన్న సర్వే నెం.1423లోని 9.54 యకరాలు భూమిని కొందరు రైతులు అక్రమంగా దున్నారనీ, అధికారులు స్పందించి భూములు అన్యాక్రాంతం కాకముందే చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున భూములకు కౌలు వేలం నిర్వహించాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘంలో తల్లపనేనికి చోటు



రొంపిచర్ల: మండలంలో ముత్తనపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న తల్లపనేని రామారావు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యుఎస్) రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు టీఎన్‌యుఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీరామ శెట్టి వెంకటేశ్వర్లు తనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో టీఎన్‌యుఎస్ బలోపేతానికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తాను ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. టీఎన్‌యుఎస్ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రామారావుకు టీఎన్‌యుఎస్ పల్నాడు జిల్లా నాయకులు నడింపల్లి సుబ్బారావు, పాలేటి శ్రీనివాసరావు, ఏలూరి అనంతమ్మ, తదితరులు అభినందనలు తెలిపారు.

శిలఫలకాలు పగలకొట్టిన వారిపై కేసు నమోదు

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో గ్రామ సచివాలయం, రైతుభరోసా భవనాలపై గతంలో ఏర్పాటు చేసిన శిలఫలకాలను గుర్తు తెలియని వ్యక్తులు పగలకొట్టినట్లు ఎస్‌ఐ చల్లా సురేష్ సోమవారం తెలిపారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి పి.రవీంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గ్రామాల్లో శాంతి భద్రతలు విఘాతం కల్గించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

17న పంచలోహ విగ్రహాల ప్రతిష్ట

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన ప్రముఖ అతి పురాతన శైవ క్షేత్రమైన గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో పలు దేవతామూర్తుల ఉత్సవ పంచలోహ విగ్రహాలను తొలిఏకాదశి సందర్భంగా ఈ నెల 17న ప్రతిష్టించనున్నట్లు బద్దూరి బ్రహ్మారెడ్డి తెలిపారు.

బాల్య వివాహాలు చేస్తే శిక్షార్హులే

డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ దాసరి శౌరిరాజు



మాట్లాడుతున్న సీడీపీవో శాంతకుమారి

నాదెండ్ల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్ట ప్రకారం శిక్షార్హులని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ దాసరి శౌరిరాజు చెప్పారు. స్థానిక ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సాతులూరు సెక్టార్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మిషన్‌శక్తి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సీడీపీవో జి.శాంతకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండని బాలికలకు వివాహాలు చేయటం నేరమన్నారు. బాలికలకు చక్కటి విద్య అందించి వారి జీవితాభ్యున్నతికి బాటలు వేయాలన్నారు.

ఎవరైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే తప్పనిసరిగా స్థానిక అధికారులకు గానీ పోలీసులకు గానీ సమాచారమివ్వాలని కోరా రు. ఇలా సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. బాలల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలు, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలల ఉజ్వల భవిష్యత్‌కై ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని అవి సాధించే దిశగా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ కె.పద్మ, జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం వెంకటరావు, ఎంఎస్‌కేలు అఖిల, సుష్మస్టెల్లా, అంగన్‌వాడీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత

యడ్లపాడు: బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ నాదెండ్ల ప్రాజెక్టు ఏసీడీపీవో నిర్మలరాణి పేర్కొన్నారు. మండలంలోని ఉన్నవ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మిషన్‌శక్తి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు సంయుక్తంగా సోమవారం 8, 10 తరగతుల బాలికలకు నిర్వహించిన ఈ అవగాహన సదస్సులో ఏసీడీపీవో నిర్మలారాణితో పాటు సూపర్‌వైజర్లు, పాఠశాల హెచ్‌ఎం ప్రసంగించారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా జరిమానా తప్పదని హెచ్చరించారు.

బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, వచ్చే అనారోగ్య సమస్యల్ని వివరించారు. కిషోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అలాగే బాలల హక్కులు, విద్యాహక్కు చట్టం ప్రయోజనాలు, గుడ్‌టచ్–బ్యాడ్‌టచ్‌పై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మారుతి, ఐసీడీఎస్ వంకాయలపాడు సెక్టార్ సూపర్‌వైజర్ శివపార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీల, రజిని, సుస్మిత, కృపామణి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహిస్తేనే మంచి గుర్తింపు

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు వలేటి శివకృష్ణ



అధికారులను సత్కరిస్తున్న బ్రాంచ్ మేనేజరు వలేటి శివకృష్ణ, లోకేష్

శావల్యాపురం: అంకిత భావంతో విధులు నిర్వహించిన ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందుతారని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు వలేటి శివకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో క్రెడిట్ అధికారి గుబ్బల వెంకట సుధీర్, కౌంటరు అధికారి అక్కిపోగు నివ్యలు విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై వెళుతున్న సందర్భంగా ఇరువురికీ వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బ్రాంచ్ మేనేజరు వలేటి శివకృష్ణ మాట్లాడుతూ శావల్యాపురం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు శాఖలో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి అందరి మన్ననలు పొందటం అభినందనీయమన్నారు. ఖాతాదారులకు సకాలంలో పారదర్శకంగా సేవలు అందించి జిల్లాస్థాయిలో శావల్యాపురం బ్రాంచ్ శాఖకు మంచి గుర్తింపు వచ్చేలా పనిచేయటం బ్యాంకు అధికారుల పనితీరుకు నిదర్శమన్నారు. శావల్యాపురం బ్యాంకు శాఖ రూ.210 కోట్లు వ్యాపారం నిర్వహించటం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన వారిని దుశ్శాలువాతో పూలదండలతో ఘనంగా నిర్వహించారు. కారుమంచి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు జి.లోకేష్, బ్యాంకు అధికారులు సాయిరామ్, ఆర్.దీలీప్ కుమార్, బీమా పథకం అధికారులు రామకృష్ణా రెడ్డి, జంగా నాగరాజు, రామిరెడ్డి, సీసీలు గొట్టం రమాదేవి, బేబీరాణి, బ్యాంకు వీసీలు పుల్లారావు, వెంకటరావు, యానిమేటర్లు పాల్గొన్నారు.

ఇష్టపడి విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకోండి

వ్యాపారవేత్త వడ్డేపల్లి శివనాగేశ్వరరావు



పుస్తకాలు అందజేస్తున్న శివనాగేశ్వరరావు

యడ్లపాడు: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదివినప్పుడే మంచి ఫలితాలను సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారని బోయపాలెంకు చెందిన వ్యాపారవేత్త వడ్డేపల్లి శివ నాగేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. వంకాయలపాడులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యాసామగ్రి పంపిణీ సోమవారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దాత శివనాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రాథమిక విద్యే ఉన్నత విద్యకు పునాదిగా చేసుకోవాలన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి విద్యకు దూరం కాకూడదన్నారు. దాత జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కేక్ కట్ చేసి స్వీట్లతో పాటు రెండు పాఠశాలల్లోని 252 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం జె.రవి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో బి.శ్రీనివాసరావు, వి.పెద్ద అంకమ్మరావు, చక్రవర్తి, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, వీరాస్వామి పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో కె-రిడ్జి పాఠశాలకు ప్రథమ బహుమతి



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ నాతాని

నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట రంగస్థలి ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన నృత్య పోటీలలో కె-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ బర్నబాస్ సోమవారం తెలిపారు. బృంద నృత్యంలో విజయం సాధించి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, సినీ నటుడు రఘుబాబు చేతుల మీదుగా తమ విద్యార్థులు బహుమతులు అందుకోవటం ఆనందంగా ఉందన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, అకడమిక్ కోఆర్డినేటర్ హేమంత్, క్యాంపస్ ఇన్‌చార్జ్ గోపి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

రేపటి నుంచి అమృత వర్షోత్సవాలు

మాచర్ల: బ్రహ్మర్షి సద్గురు ముసలయార్య దేశిక స్వామి వారి 135వ జయంతి సందర్భంగా 75వ అమృత వర్షోత్సవ ఆరాధన మహోత్సవాలు ఈ నెల 17వ తేదీ నుంచి 23వ తేదీ వరకు వెల్దుర్తి మండలంలోని గుండ్లపాడు గ్రామంలోని జ్ఞానాశ్రమంలో నిర్వహించనున్నట్లు జ్ఞానాశ్రమ నిర్వాహకులు కాశీ విశ్వనాధస్వామి సోమవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 17న తొలిఏకాదశి రోజున స్వామి వారి జయంత్యుత్సవం, గురుపౌర్ణమి రోజున లలితా యజ్ఞం, 23న 75వ ఆరాధన, పూర్ణాహుతి జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్వామీజీలు, పీఠాధిపతులు, భక్తులు పాల్గొంటారన్నారు. అదే విధంగా అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. పల్నాడు ప్రాంతంలోని భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమృత వర్షోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ

రెంటచింతల: ప్రభుత్వ పాఠశాలలలో చదువుకుంటున్న పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మండల టీడీపీ అధ్యక్షులు చపారపు అబ్బిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 42 మంది విద్యార్థులకు ఆయన హెచ్‌ఎం బేబిరాణి, టీడీపీ నాయకులతో కలిసి స్టూడెంట్స్ కిట్స్‌ను పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామకృష్ణ, శ్రీనివాసరావు, పాస్టర్ ఐజాక్, రాయపురెడ్డి, ఇన్నారెడ్డి, జ్ఞానయ్య, థామస్, దాసయ్య, సామూల్, శిల్వారాజు, జక్రయ్య పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం, శిక్షార్హం

సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వెంకట నాగ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకట నాగ శ్రీనివాసరావు

సత్తెనపల్లి: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం, శిక్షార్హమని సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాల్లో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) అధ్యక్షతన సత్తెనపల్లి నాలుగు న్యాయస్థానాల్లో ఉన్న కోర్టు సిబ్బందికి మోటారు వాహనాల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సత్తెనపల్లి సివిల్ జడ్జి వెంకట నాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ శరీరంలో ప్రధాన అవయవం తల అని, అనుకోకుండా చిన్న ప్రమాదం సంభవించినా తలకు గాయం అయితే మరణం సంభవించే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనం ఇవ్వవద్దని, అలా ఇస్తే దాని యజమానులపై కూడా కేసు నమోదు అవుతుందన్నారు. సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిఫ్ హుస్సేన్ మాట్లాడుతూ కారులో ప్రయాణం చేసే వారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. సత్తెనపల్లి రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని, వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడవద్దన్నారు.

ద్విచక్ర వాహనం నడిపే వారే కాకుండా వెనుక కూర్చునే వారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. పిడుగురాళ్ళ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాంబాబు మాట్లాడుతూ నిత్యం సంభవిస్తున్న రోడ్డు ప్రమాద కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది డి.శ్రీనివాసరావు, నాలుగు కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలి



త్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చిలకలూరిపేట: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలని పసుమర్రు ఎస్‌ఎంకే జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం యడవల్లి హనుమంతరావు చెప్పారు. పాఠశాల విద్యార్థినిలు షేక్ అఫ్రోజహా నూజివీడు త్రిపుల్ ఐటీలో, షేక్ షీమా ఫర్హాత్ ఒంగోలు త్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈ విద్యార్థులకు సోమవారం పాఠశాల ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఈ విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని త్రిపుల్ ఐటీవంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించేందుకు కృషి చేయాలని చెప్పారు. తద్వారా ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. విద్యార్థులు త్రిపుల్ ఐటీలో సీట్లు సాధించటం ద్వారా వారి తల్లిదండ్రులతో పాటు చదువుతున్న పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. పాఠశాల గణిత ఉపాధ్యాయిని జి.అనసూయ ఇరువురు విద్యార్థులకు చేరో రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ మొహమ్మద్ యాసిన్, తోట శివకుమార్, అప్పారావు, శంకరరావు, ఆశాలత, శివకుమారి, ఖాదర్‌మస్తాన్ పాల్గొన్నారు.

నర్సరీ యజమానులు నిబంధనలు పాటించాలి



మండాదిలోని నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న హెచ్‌వో సురేష్

వెల్దుర్తి: నర్సరీ యజమానులు నర్సరీ చట్టం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఉద్యాన శాఖాధికారి ఎన్.సురేష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మండాది గ్రామంలో షేడ్‌నెట్ నర్సరీలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ నిర్వాహకులు నర్సరీ చట్టం 2010 ప్రకారం లైసెన్స్, రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నర్సరీ లైసెన్స్ కోసం షేడ్ నెట్ చుట్టూ 8 నుంచి 14 అడుగుల ఎత్తు వరకు ఇన్‌సెక్ట్ నెట్ వేసి రక్షణ కల్పించాలన్నారు. షేడ్ నెట్ హౌస్‌లో డబుల్‌డోర్ సౌకర్యం కలిగి ఉండాలని, కీటకాలు లోపలకు ప్రవేశించకుండా నెట్‌కు ఎక్కడా రంధ్రాలు లేకుండా చూసుకోవాలన్నారు.

మిరప విత్తనాలను ప్రో ట్రేలలో నాటి వాటిని ఎత్తైన మడులపై అమర్చాలన్నారు. ప్రో ట్రేలలో శుద్ధి చేసిన కోకోపిట్ మాత్రమే వాడాలన్నారు. నర్సరీ యజమానులు విత్తనాల ప్యాకెట్ మీద విత్తన రకం, లాట్ నెంబర్, కంపెనీ లేబుల్‌ను గమనించి నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాల ఒరిజినల్ రశీదులను భద్రపరుచుకొని నర్సరీ రిజిష్టర్‌లలో నమోదు చేసుకోవాలన్నారు. లైసెన్స్ లేని వారు, కొత్తగా షేడ్ నెట్ నర్సరీలు వేసిన వారు, లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాల్సిన వారు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులకు నాసిరకం, అధిక ధరలకు నారు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్స్ లేకుండా మిరప నారు వేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నర్సరీల యజమానులు, రైతులు, సహాయకుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: విజయవాడలో ఇటీవల నలుగురు న్యాయవాదులపై జరిగిన దాడిని నిరసిస్తూ సోమవారం పట్టణంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి న్యాయదేవత విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ఇటీవల న్యాయవాదులపై తరచూ దాడులు జరుగుతున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. న్యాయవాదులపై దాడి చేసిన వారిపై కఠినంగా శిక్షలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి మన్నెం వెంకటేశ్వరరావు, న్యాయవాదులు డి.శ్రీనివాసరావు, జె.విజయ్ కుమార్, నరసింహ శాస్త్రి, జూపల్లి శేషయ్య, రాజవరపు నరసింహారావు, బూతుకురి రామిరెడ్డి, బి.సంగీతరావు, జి.పవన్, షేక్ ఫాజులుల్లా, నాగరాజు, పిల్లి సుధీర్, గుజ్జర్లపూడి సురేష్ బాబు, ఎర్రమాసు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

త్రీఫేజ్ విద్యుత్ సరఫరా పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

దాచేపల్లి: నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ ఏడీఏ తుమ్మల వీరేశ్వరరావు చెప్పారు. నక్సల్ ప్రభావిత గ్రామమైన కేసానుపల్లిలో త్రీఫేజ్ కరెంట్ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఏడీఏ వీరేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ గ్రామంలో నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ స్తంబాలు, వైర్లు ఏర్పాటు చేస్తామన్నారు. త్రీఫేజ్ కరెంట్ అందుబాటులో ఉండటం వలన కుటీర, చిన్న తరహా పరిశ్రమలు స్థాపించే అవకాశం ఉందని, దీని ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన చెప్పారు.

కేసానుపల్లితో పాటుగా నక్సల్ ప్రభావిత గ్రామాలైన రామాపురం, శ్రీనగర్, గామాలపాడు, సారంగపల్లి అగ్రహారం, మాదినపాడు, కొత్తూరు, తక్కెళ్లపాడు, భట్రుపాలెం గ్రామాలకు కూడా త్రీఫేజ్ కరెంట్ పనులు చేపడతామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, ఏఈ దండే నాగేశ్వరరావు, సర్పంచ్ శ్రీపతి ప్రసాద్, నాయకులు నెల్లూరి రామకోటయ్య, నెల్లూరి కోటయ్య, షేక్ జానయ్య, కోట సాయికుమార్, నెల్లూరి రామారావు తదితరులున్నారు.

పారిశుద్ధ్య కార్మికులపై ఇంత నిర్లక్ష్యమా..!



డయేరియా ప్రాంతంలో కాలవలో చెత్తను తొలగిస్తున్న కార్మికురాలు

పిడుగురాళ్ల: పారిశుద్ధ్య కార్మికులపై అధికారులు మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు పట్టణంలో బలంగా వినిపిస్తున్నాయి. లెనిన్ నగర్, మారుతీ నగర్‌లో పారిశుద్ధ్య కార్మికుల చేత డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని ఎక్కువ గంటలు పని చేయిస్తూ వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా కాలువలో పూడికను తీయిస్తున్నారు. ఇటీవల ఓ మున్సిపల్ కార్మికుడు డయేరియా ప్రాంతంలో పని చేస్తూ డయేరియా సోకి చనిపోయాడు. అయినా కార్మికులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించటం లేదు. అయితే కార్మికులకు సౌకర్యాలు కల్పించి వారి చేత పని చేయించాలి. అంతేకాకుండా వారికి పని చేసిన వెంటనే సబ్బులు వంటివి అందించాలని అలాంటివి ఏమీ లేకుండానే వారి చేత పని చేయిస్తున్నారు. అంతేకాకుండా డయేరియా ప్రాంతంలో పని చేస్తున్న కార్మికులకు మంచి నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. లెనిన్ నగర్, మారుతీ నగర్‌లో డయేరియా అదుపులోకి వస్తుందంటే మున్సిపల్ కార్మికులు చేసిన పని అంతా ఇంతా కాదని ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. కానీ వారికి అనారోగ్య సమస్యలు వస్తే పట్టించుకునే వారు లేరని, కనీస సౌకర్యాలు కూడా లేవని మున్సిపల్ కార్మికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మున్సిపల్ కార్మికులకు సరైన సౌకర్యాలు కల్పించాలని పట్టణ ప్రజలతోపాటు, కార్మికులు కోరుకుంటున్నారు.

సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల సూపరింటెండెంట్ ఉదయభాను

మాచర్ల: వర్షాల వలన సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశముండటంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండి రోగాలకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల సూపరింటెండెంట్ ఉదయభాను అన్నారు. సోమవారం ఆసుపత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశముందన్నారు. ఇప్పటికే డయేరియా పెరిగి కొంత ఆందోళనకు గురిచేస్తుందని, అయితే మాచర్లలో లేదన్నారు. దోమల వలన సోకే వ్యాధుల నియంత్రణకు రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ఇళ్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాగునీటి విషయంలో ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలందరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆమె కోరారు.

పశర్లపాడులో రేషన్ షాపు సీజ్



రేషన్ షాపులో తనిఖీ చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ మురళి, ఆర్‌ఐ కాంతారావు

రెంటచింతల:మండలంలోని పశర్లపాడు గ్రామం 26వ నంబర్ రేషన్ షాపులో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి లబ్ధిదారులకు పంపిణీ చేసే నిత్యావసర సరుకులలో వ్యత్యాసాలు గుర్తించి రేషన్ షాపును సీజ్ చేసినట్లు పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ మురళి సోమవారం తెలిపారు. రేషన్ లబ్ధిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. షాపులో ఉన్న నిత్యావసర సరుకులకు, లబ్ధిదారులకు పంపిణీ చేసిన సరుకులకు, రికార్డులలో నమోదు చేసిన సరుకుల వివరాలకు తేడాలు ఉన్నాయన్నారు. దీంతో 1955 నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం 26వ నంబర్ రేషన్ షాపుపై 6ఏ కేసు నమోదు చేసి సీజ్ చేశామన్నారు. పూర్తి నివేదికను ఇన్‌చార్జి జేసీ వినాయకంకు పంపించడం జరిగిందన్నారు. ప్రభుత్వం ద్వారా పంపిణీ చేస్తున్న సరుకులను కార్డుదారులైన లబ్ధిదారులకు అందజేయకుండా బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే రేషన్‌షాపు డీలర్లపై కఠిన చర్యలు తీసుకుని షాపులను సీజ్ చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ మురళి హెచ్చరించారు. ఈ తనిఖీలలో మండల రెవెన్యూ అధికారి దాసరి కాంతారావు, వీఆర్వో అబ్దుల్ షూకూర్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించండి



తహసీల్దార్ మంజునాథరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మెట్టు గోవిందరెడ్డి

మాచర్ల రూరల్: పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి ఆర్టీసీ బస్సులను, ఇతర వాహనాలను నిర్ణీత ప్రదేశాలలో నిలుపుదల చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి కోరారు. సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో తహసీల్దార్ మంజునాథ రెడ్డికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఆక్రమణలు పెరిగిపోయాయని, కనీసం పాదాచారులకు జాగా దొరకటం లేదని, ఆవులు ప్రధాన రహదారులలోనే అడ్డంగా పడుకొని వాహనదారులను ఇబ్బందికి గురిచేస్తున్నాయన్నారు. ఆటో స్టాండ్, పార్కింగ్ ప్లేస్‌లను ఏర్పాటు చేసి పట్టణ ప్రజల ఇబ్బందులు తొలగించాలని ఆయన కోరారు. అలాగే పట్టణంలోని ఖాళీ స్థలాల్లో చెట్లు ఇతర చెత్త పేరుకుపోతున్నాయని వాటిని వెంటనే తొలగించాలని మరో అర్జీ అందజేసినట్లు తెలిపారు.